క్లుప్తంగా

విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించండి



బడిబాట ర్యాలీలో పాల్గొన్న ఎంఈవో ఉపాధ్యాయులు

కథలాపూర్: ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులను చేర్పించాలని కథలాపూర్ ఎంఈవో ఆనందరావు కోరారు. మండలంలోని తాండ్ర్యాలలో సోమవారం బడిబాట నిర్వహించారు. వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు కలిసి ర్యాలీ నిర్వహించారు. విద్యార్థుల ఇళ్ల వద్దకు వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న వసతులు, ఫలితాలను వివరించారు. కొత్తగా విద్యార్థుల అడ్మిషన్లు తీసుకున్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం కిషన్‌రావు, జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం స్వామి, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

జీవన్‌రెడ్డికి గల్ఫ్ కార్మికుల మద్దతు



మాట్లాడుతున్న ఖాజా నిజామొద్దీన్

జగిత్యాలరూరల్: నిజామాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి తాటిపర్తి జీవన్‌రెడ్డికి మద్దతుగా దోహఖతర్‌లోని టీపీసీసీ ఎన్ఆర్ఐసెల్ ఖతర్ కన్వీనర్ ఖాజా నిజామొద్దీన్ ఆధ్వర్యంలో క్యాంటో క్యాంప్‌లో ప్రవాసి గర్జన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ గల్ఫ్ కార్మికులకు చేసింది శూన్యమన్నారు. గల్ఫ్ కార్మికులను గుర్తించి వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన నాయకుడు జీవన్‌రెడ్డి అన్నారు. ఆయన గెలుపునకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలన్నారు.

బాధిత కుటుంబానికి రాజ్యసభ ఎంపీ పరామర్శ



శ్రీనివాస్‌ను పరామర్శిస్తున్న ఎంపీ సురేశ్‌రెడ్డి

కథలాపూర్: మండలంలోని అంబారిపేటలో మాజీ సర్పంచ్ గోపు శ్రీనివాస్‌ను రాజ్యసభ సభ్యుడు సురేశ్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. శ్రీనివాస్ భార్య నెలరోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందారు. దీంతో బాధిత కుటుంబాన్ని ఎంపీ పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని ఓదార్చారు. ఆయన వెంట ఎంపీటీసీ గంగరాజం, నాయకులు చీటి విద్యాసాగర్‌రావు, చిన్నయ్య, సత్యం, గంగాధర్, మనోజ్ ఉన్నారు.

ఎంఈవో కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

జగిత్యాల: ఎన్నికల విధుల్లో ఉండి వడదెబ్బతో మరణించిన వెల్గటూర్ మండల విద్యాధికారి బత్తుల భూమయ్య కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యాళ్ల అమర్‌నాథ్‌రెడ్డి, బోయినిపల్లి ఆనందరావు జిల్లాకలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఎన్నికల విధుల్లో విధులు నిర్వహిస్తూ ఎండవేడిమి తట్టుకోలేక వడదెబ్బకు గురై ఈనెల 4న మరణించారని, బాధిత కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెల్లించి ఆదుకోవాలని కోరారు.

చిరు వ్యాపారులకు టోపీలు అందజేత



జగిత్యాల: భగవాన్ శ్రీసత్య సాయి బాబా తల్లి ఈశ్వరమ్మ వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం జగిత్యాల సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో పేదలకు చెప్పులు, వృద్ధులకు గొడుగులు, మజ్జిగ, టోపీలు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ కన్వీనర్ బట్టు రాజేందర్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

అసౌకర్యాల అంగన్‌వాడీ కేంద్రాలు

- అద్దె భవనాల్లో నిర్వహణ
- అధ్వానంగా అంగన్‌వాడీ కేంద్రాల తీరు
- కొరవడిన సూపర్‌వైజర్ల పర్యవేక్షణ



చాలమద్దిలోని అంగన్‌వాడీ కేంద్రం-2

మెట్‌పల్లిరూరల్: చిన్న పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్యను అందించడంతో పాటు, మాతా శిశు సంరక్షణలో భాగంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన అంగన్వాడీ కేంద్రాల్లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేకపోవడం,అద్దె భవనాల్లో కేంద్రాలను కొనసాగించడం, ఇతర సమస్యలతో కేంద్రాల నిర్వహణ ప్రశ్నార్థకంగా మారింది. మరోవైపు అనువుగా లేని అద్దె భవనాల్లో కేంద్రాలను నిర్వహిస్తున్న విషయంలో అభ్యంతరం చెప్పాల్సిన సూపర్‌వైజర్లు, ఆపై అధికారులు చూసిచూడనట్లుగా వ్యవహరించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పాత ఇళ్లు,ఇరుకు గదులు..

మెట్‌పల్లి మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలు సగానికి పైగా అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. మండలంలో మొత్తం 49 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో 11 సొంత భవనాల్లో,15 ప్రభుత్వ పాఠశాలల ఆవరణల్లోని గదుల్లో కేంద్రాలను నడుపుతుండగా, మిగతా 23 కేంద్రాలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. అయితే సొంత భవనాలు లేని కేంద్రాలను ఏళ్ల నాటి పాత ఇళ్లలో, అందులో ఇరుకైన గదుల్లో కనీస సౌకర్యాలు లేని వాటిలో నిర్వహిస్తున్నారు. కనీసం ఉండడానికి వీలులేకుండా ఉన్న పాత ఇళ్లలో కేంద్రాలను నడిపిస్తుండడంతో కేంద్రాలకు వచ్చే గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ఇబ్బందులు తప్పడంలేదు. చిన్నపాటి అద్దె గదుల్లోనే సామగ్రిని భద్రపరచడం, అక్కడే వండిపెట్టడం, చిన్నారులకు

మొత్తం అంగన్‌వాడీ కేంద్రాలు	49
అద్దె భవనాల్లో ఉన్నవి	23
స్కూల్ ఆవరణలో నిర్వహిస్తున్నవి	15
సొంత భవనాల్లోని కేంద్రాలు	11

పూర్వ ప్రాథమిక విద్య అందించడంతో పాటు ఇతర పనులను ఒకేచోట నిర్వహించాల్సిన దుస్థితి నెలకొంది. సరైన సౌకర్యాలు లేని కేంద్రాలకు వెళ్లేందుకు ఎక్కువ మంది ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది. ఫలితంగా కేంద్రాల్లో హాజరుశాతం సైతం పడిపోతుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కొరవడిన పర్యవేక్షణ..

ఏళ్ల నాటి పాత ఇళ్లలో,కనీస వసతులు లేని చోట ఇరుకు గదుల్లో అంగన్‌డీ కేంద్రాలను నిర్వహిస్తున్న సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోకపోవడం లేదు.అద్దె భవనాల్లో కనీస వసతులు ఉన్నచోట కేంద్రాలను నిర్వహించాల్సి ఉండగా ఆ దిశగా చర్యలు చేపట్టడంలేదు. కేంద్రాల్లో కనీస వసతులు,సౌకర్యాలు ఉన్నాయా?,సక్రమంగా నడుస్తున్నాయా ?,పౌష్టికాహారం పంపిణీ సరిగ్గా జరుగుతుందా? గర్భిణులు, బాలింతలు, చిన్నారుల హాజరు శాతం ఎలా ఉంది? అనే వాటితో పాటు ఇతర విషయాలపై సూపర్‌వైజర్లు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ జరపాల్సి ఉంటుంది. కానీ వారి పర్యవేక్షణ కొరవడడంతోనే కేంద్రాల నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

> **మా దృష్టికి రాలేదు**
>
> అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న అంగన్‌డీ కేంద్రాలకు రూ.1000 అద్దె రుసుము చెల్లిస్తున్నాం. ఒకే గది కాకుండా సౌకర్యవంతంగా ఉన్న వరండా కూడా ఉంటుంది. అసౌకర్యంగా ఉన్నట్లు మా దృష్టికి రాలేదు. అలాంటివి ఏమైనా ఉంటే మా దృష్టికి తీసుకువస్తే వెంటనే చర్యలు చేపడుతాం.
>
> – తిరుమలదేవి,సీడీపీవో,మెట్‌పల్లి

వైద్య సిబ్బందిపై దాడికి నిరసన





రాయికల్, ధర్మపురిలో పీహెచ్‌సీల ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న వైద్యులు, సిబ్బంది

జగిత్యాలరూరల్: కోరుట్ల ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బందిపై దాడిచేసిన వారిపై చర్యలు చేపట్టాలని రాయికల్ ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ రవి, డాక్టర్లు శశికాంత్‌రెడ్డి, రజిత అన్నారు. సోమవారం రాయికల్ ప్రభుత్వ ఆస్పత్రిలో, ఒడ్డె లింగాపూర్‌లో వైద్యులు, సిబ్బంది నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోరుట్ల ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బందిపై డీజిల్ పోసి కాల్చిచంపే ప్రయత్నం చేసిన సంఘటన అమానుషమన్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కస్తూరి సతీశ్, సీహెచ్‌వో ప్రమీల, హెచ్‌ఈవో శ్రీనివాస్, సూపర్‌వైజర్ శ్రీధర్, ఏఎన్ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

పెగడపల్లి: వైద్య సిబ్బందిపై దాడిని నిరసిస్తూ సోమవారం పెగడపల్లి ఆరోగ్య కేంద్రం సిబ్బంది నల్ల బ్యాడ్జిలతో విధులకు హాజరయ్యారు. దాడికి యత్నించిన దుండగులను అరెస్టు చేసి వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు నరేశ్, రమ, నర్సింగ్ ఆఫీసర్ రవికిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.

మల్యాల: మండల కేంద్రంలోని పీహెచ్‌సీ లో ఆరోగ్య సిబ్బంది నిరసన వ్యక్తం చేశారు. నల్ల రిబ్బన్లు ధరించి, నిరసన వ్యక్తం చేస్తూ, ఆరోగ్య సిబ్బంది పై దాడి చేసిన వారి పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ మౌనిక, నాగలక్ష్మి, దేవి సింగ్,పాల్గొన్నారు.

ధర్మపురి: కోరుట్ల ప్రభుత్వ ఆస్పత్రిపై దాడి చేసినందుకు నిరసనగా సోమవారం నేరెళ్ల ప్రభుత్వాస్పత్రి ఎదుట వైద్యులు, సిబ్బంది నిరసన వ్యక్తం చేశారు. దాడికి బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ అవంతి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శ్రీనివాస్, హెచ్‌ఈవో రాజేశం, సూపర్‌వైజర్ సతీశ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంఈవో సేవలు మరువలేనివి



నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయ సంఘాల నేతలు

వెల్గటూర్ : ఎంఈవో బత్తుల భూమయ్య సేవలు మరువలేనివని మండల ఉపాధ్యాయ సంఘం నేతలు నర్సింగం, సంపత్ అన్నారు. సోమవారం వెలగటూర్ మండల కేంద్రంలోని మండల విద్యావనరుల కేంద్రంలో భూమయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెల్గటూర్, ఎండపల్లి, బుగ్గారం, ధర్మపురి మండలాల విద్యాధికారిగా సేవలందించిన భూమయ్య విద్యారంగానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం నేతలు శేఖరయ్య, జీవన్ కుమార్, అనిల్ కుమార్, సత్యనారాయణ, కుమారస్వామి, రాజయ్య, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

ధర్మపురి: ఎంఈవో బత్తుల భూమయ్య సేవలు చిరస్మరణీయమని ఉపాధ్యాయ సంఘాల నాయకులు అన్నారు. ధర్మపురిలోని మండల విద్యావనరుల కేంద్రంలో సోమవారం ధర్మపురి, బుగ్గారం ఎమ్మార్సీ సిబ్బంది ఆధ్వర్యంలో సంతాప సభ ఏర్పాటు చేసి ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు గోవర్ధన్, కాశెట్టి రమేశ్, మహేష్, భీమయ్య, గాదె శ్రీనివాస్, విజయలక్ష్మి, పి మహేందర్ పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల బైక్ ర్యాలీ



కలిగోటలో బీజేపీ నాయకుల బైక్ ర్యాలీ

కథలాపూర్: కరీంనగర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కు మద్దతుగా మండలంలో బీజేపీ నాయకులు సోమవారం 300 బైక్‌లతో ర్యాలీ నిర్వహించారు. మండలంలోని కలిగోట, తాండ్ర్యాల, గంభీర్‌పూర్, పోసానిపేట, చింతకుంట, భూషణరావుపేట, కథలాపూర్, సిరికొండ గ్రామాల మీదుగా బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అన్ని గ్రామాల బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

తాటిపల్లిలో ప్రచారం

మల్యాల: మండలంలోని తాటిపల్లిలో కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్ కి మద్దతుగా సోమవారం బీజేపీ నాయకులు ప్రచారం చేశారు. ఉపాధి హామీ కూలీలతో సమావేశమై మోదీ పాలనలో చేపట్టిన పథకాలను వివరించారు. ఎంపీ బండి సంజయ్‌ని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బింగి వేణు, రాములు, రాజశేఖర్, నర్సయ్య, గంగస్వామి, పాల్గొన్నారు.

ఎంపీగా బాజిరెడ్డి గోవర్ధన్‌ను గెలిపించాలి



వర్షకొండలో ప్రచారం చేస్తున్న నాయకులు

ఇబ్రహీంపట్నం: నిజామాబాద్ ఎంపీగా బాజిరెడ్డి గోవర్ధన్‌ను గెలిపించాలని బీఆర్ఎస్ పార్టీ నాయకులు సోమవారం మండలంలోని వర్షకొండలో ఉపాధిహామీ పనుల వద్ద ప్రచారం చేశారు. అందరికీ అందుబాటులో ఉండే వ్యక్తి, అభివృద్ధి చేసే నాయకుడు బాజి రెడ్డి గోవర్ధన్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు ఓటు వేసి మోసపొవద్దన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఇస్తున్న మోసపూరిత హామీలను ప్రజలు నమ్మవద్దని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ నడిపి రాజన్న, నాయకుడు తుక్కారం, కార్యకర్తలు పాల్గొన్నారు.

సారంగాపూర్ ఎస్సైగా దత్తాద్రి

సారంగాపూర్: మండల ఎస్సైగా దత్తాద్రి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడి ఎస్సై తిరుపతి సస్పెండ్ కావడంతో అప్పటి నుంచి బీర్‌పూర్ ఎస్సై గౌతంపవార్ ఇన్‌చార్జీగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. దత్తాద్రి జగిత్యాల సీసీఎస్ నుంచి సారంగాపూర్‌కు వచ్చారు.

బీజేపీ ధర్మపురి నియోజకవర్గ ఇన్‌చార్జిగా రాంబాబు

వెల్గటూర్ : బీజేపీ ధర్మపురి నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఎండపల్లి మండలం కొత్తపేట గ్రామానికి చెందిన కొమ్ము రాంబాబు నియమితులయ్యారు. జగిత్యాల జిల్లా బీజేపీ అధ్యక్షులు మోరపల్లి సత్యనారాయణరావు సోమవారం నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ నియోజకవర్గంలో బీజేపీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

మెట్‌పల్లి: కోరుట్ల ప్రభుత్వాస్పత్రి సిబ్బందిపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మెట్‌పల్లి ఐఎంఏ అధ్యక్షుడు గంగసాగర్, కార్యదర్శి ఆనంద్‌బాబు సోమవారం డిమాండ్ చేశారు. సిబ్బందిపై కొందరు కిరోసిన్ చల్లడంతో పాటు దాడి చేయడం సరికాదన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలి

పెగడపల్లి: ఉపాధిహామీ పథకాన్ని కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి కోరారు. మండలంలోని కీచులాటపల్లిలో ఉపాధిహామీలో చేపట్టిన కందకాల తవ్వకాల పనులను ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్‌కార్డున్న ప్రతి కూలీకి పని కల్పించాలని ఈజీఎస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. పనికి హాజరైన ప్రతి కూలికి గిట్టుబాటు వేతనం అందేలా చూడాలన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

సారంగాపూర్: బీర్‌పూర్ గ్రామపంచాయతీలో పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్న పూడూరి రవి(28) ఇటీవల మృతిచెందగా, బాధిత కుటుంబానికి గ్రామానికి చెందిన గౌడ సంఘంలోని కొంత మంది సభ్యులు కలిసి రూ. 16,600 అందజేశారు. మృతుడికి భార్య అనురాధ, ఇద్దరు కుమారులు ఉన్నారు. రవి కుటుంబాన్ని దాతలు ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు సత్యనారాయణ, పులి సతీష్, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం బండలింగాపూర్ గండి హనుమాన్ ఆలయ హుండీని సోమవారం లెక్కించారు. మొత్తం రూ.1.62 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఈవో విక్రమ్,సిబ్బంది,అర్చకులు పాల్గొన్నారు.

సహస్ర లింగాల ఆలయంలో పూజలు

జగిత్యాలరూరల్: మండలంలోని పొలాస సహస్ర లింగాల ఆలయంలో మాస శివరాత్రి ప్రత్యేక వేడుకలను పురస్కరించుకుని సోమవారం మహాశివుడికి అభిషేకాలు నిర్వహించి అన్నపూజ, సహస్ర కర్పూర బిల్లలతో దీపాలు వెలిగించి స్వామివారికి మంగళ హారతులు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు గంగాధర్, మహిళలు పాల్గొన్నారు.

కొప్పులకు మద్దతుగా ప్రచారం



నామాపూర్‌లో మాట్లాడుతున్న నందిని

పెగడపల్లి: పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను ఎంపీగా గెలిపించాలని ఆయన కూతురు నందిని కోరారు. మండలంలోని పెగడపల్లి, నామాపూర్ గ్రామాల్లో సోమవారం ఈశ్వర్‌కు మద్దతుగా బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని ఉపాధిహామీ కూలీలను కలిసి ఎమ్మెల్యేగా, మంత్రిగా ఈశ్వర్ చేపట్టిన అభివృద్ధి పనులను వివరిస్తూ కారు గుర్తుకు ఓటేయాలని ఆమె అభ్యర్థించారు. పార్టీ మండల అధ్యక్షుడు మల్లారెడ్డి, నాయకులు వెంకన్న, ఆనందం, సత్యనారాయణరెడ్డి, కరుణాకర్‌రావు, కరుణాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'ఓటుకు నోటు దొంగ రేవంత్‌రెడ్డి'



మాట్లాడుతున్న ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి

మల్లాపూర్: ఓటుకు నోటు దొంగ రేవంత్‌రెడ్డి అబద్ధాలకోరు, అవినీతిపరుడని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం రాత్రి మల్లాపూర్ మండలంలోని ముత్యంపేటలో గాంధీ కూడలి వద్ద నిర్వహించిన బీజేపీ కార్నర్ మీటింగ్‌లో పాల్గొని మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికలు ధర్మానికి.. అధర్మానికి, దేశభక్తులకు.. దేశద్రోహులకి జరుగుతున్న యుద్ధమన్నారు. దేశంలోని ప్రతి పట్టణం, గ్రామాల్లో అమలవుతున్న పథకాలు, జరుగుతున్న అభివృద్ధి పనులకు డబ్బులు ఇచ్చింది ప్రధాని మోదీనేని అన్నారు. రిజర్వేషన్లపై కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తోందన్నారు. ఎంపీగా అర్వింద్‌ను భారీ మెజార్టీతో గెలుపించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు, మండల ఇన్‌చార్జి రుద్ర శ్రీనివాస్, అసెంబ్లీ కన్వీనర్ సుఖేందర్‌గౌడ్, మండల అధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి ఎర్ర లక్ష్మి, రైతు నాయకుడు బద్దం శ్రీనివాస్‌రెడ్డి, బీజేవైఎం మండల అధ్యక్షుడు పందిరి నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పేదల ప్రభుత్వం

మేడిపల్లి: కాంగ్రెస్ పేదల ప్రభుత్వమని విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. మండలంలోని మోత్కురావుపేట, రాజలింగంపేట్, పసునూరు, గోవిందారం, దేశాయిపేట, ఈదుల లింగంపేట, మాన్నెగూడం, కమ్మరిపేట, వెంకట్రావుపేట, రాగోజీపేట, ఒడ్యాడ్ గ్రామాల్లో కాంగ్రెస్ అభ్యర్థి రాజేందర్‌రావుకు మద్దతుగా ప్రచారం చేశారు. పలువురు పార్టీలో చేరగా కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీ మండల అధ్యక్షుడు నరేశ్ రెడ్డి, రమేశ్‌రెడ్డి, చేపూరి నాగరాజు, మార్గం నర్సరెడ్డి, సాయిని గంగారెడ్డి, మాదం వినోద్, రేండ్ల మధు, భర్కం రాజశేఖర్ పాల్గొన్నారు.

ఉపాధి కూలీలను ఆదుకుంటాం

ధర్మపురి: కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఉపాధి కూలీలను ఆదుకుంటామని ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. మండలంలోని దమ్మన్నపేట, నేరెల్లలో పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకి మద్దతుగా సోమవారం ప్రచారం చేశారు. బీజేపీ మతం, దేవుడి పేరు చెప్పుకుని ఓట్లు అడగడం ఏమిటని ప్రశ్నించారు. కొప్పుల ఈశ్వర్ పదేళ్లలో ఏం చేశారో చెప్పాలన్నారు.

కాంగ్రెస్‌లోకి చేరికలు

ధర్మపురి: మండలంలోని నేరెళ్లకు చెందిన పలువురు కాంగ్రెస్‌లో చేరారు. విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆధ్వర్యంలో పార్టీలో చేరగా..ఎమ్మెల్యే గడ్డం వివేక్, ఎంపీ అభ్యర్థి వంశీ ఆహ్వానించారు.

కుల సంఘాలు మద్దతివ్వాలి

మెట్‌పల్లి: లోక్‌సభ ఎన్నికల్లో కుల సంఘాలు కాంగ్రెస్‌కు మద్దతివ్వాలని చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ కోరారు. పట్టణంలోని వెంకట్‌రెడ్డి గార్డెన్‌లో సోమవారం నిర్వహించిన గ్రామ దేవతల పూజారులు, పంబల దేవత పోతురాజుల బైండ్ల కొలువుల అసాది సంఘ ఐక్యవేదిక సమావేశంలో కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డితో కలిసి వివేక్ పాల్గొని మాట్లాడారు. జీవన్‌రెడ్డిని గెలిపిస్తే ఈ ప్రాంత ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు, పీసీసీ సభ్యుడు సుజిత్‌రావు, కొమొరెడ్డి కరం, సంఘం నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం

మల్లాపూర్: కాంగ్రెస్‌తోనే అన్నివర్గాలకు న్యాయం జరుగుతుందని పీసీసీ సభ్యుడు కల్వకుంట్ల సుజిత్‌రావు అన్నారు. మండలంలోని మొగిలిపేటలో సోమవారం మున్నూరుకాపులతో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. గ్రామ శివారులో ఉపాధి కూలీలను కలిసి ప్రచారం నిర్వహించి మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. స్థానిక బీఆర్ఎస్ నాయకులకు పార్టీ కండువా కప్పి కాంగ్రెస్‌లో చేర్చుకున్నారు. ఎంపీ ఎన్నికల్లో జీవన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమాల్లో పీసీసీ ఫిషర్మెన్ కమిటి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రుత్త నారాయణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోమ్ముల చిన్నారెడ్డి, మాజీ ఉపసర్పంచ్ ఎనడ్ల రాములు, నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

జగిత్యాల: ప్రజాసేవ, అభివృద్ధి కోసం తపించే నాయకుడు జీవన్‌రెడ్డి అని నిజామాబాద్ ఎంపీ అభ్యర్థిగా భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి అన్నారు. పట్టణంలోని 10వ వార్డులో వివిధ పార్టీలకు చెందిన నాయకులు కౌన్సిలర్ రాజన్న ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతి పాల్గొన్నారు.

ఉపాధి పనుల వద్ద ప్రచారం

కథలాపూర్: మండలంలోని కలిగోట, భూషణరావుపేట గ్రామాల్లో సోమవారం ఉపాధి కూలీల వద్ద కాంగ్రెస్ నేతలు ప్రచారం చేశారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రాజేందర్‌రావుకు మద్దతు ఇవ్వాలని కోరారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కూలీలకు పనిదినాలు పెంచి కూలీరూ. 400కు పెంచుతామన్నారు. కార్యక్రమంలో ఫిషర్మెన్ కమిటీ నియోజకవర్గ ఇన్‌చార్జి కల్లెడ గంగాధర్, మండల నాయకులు కూన శ్రీనివాస్, గడ్డం చిన్నారెడ్డి, రాజారెడ్డి, మధు, తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ చెల్లింపులను సద్వినియోగం చేసుకోవాలి

మెట్‌పల్లి: ఆస్తి పన్ను వసూలు చేసే బిల్ కలెక్టర్లకు సోమవారం కమిషనర్ హ్యాండ్ హెల్డ్ మిషన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యుపీఐ, క్యూర్ కోడ్ తదితర ఆన్‌లైన్ చెల్లింపుల కోసం 11మంది సిబ్బందికి వీటిని అందజేసినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

అక్రమ నిర్మాణం తొలగించాలి

జగిత్యాల: చల్‌గల్‌లో గుడిముందు స్థలాన్ని గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ఆక్రమించుకుని రేకుల షెడ్లు వేశారని, వెంటనే అక్రమ నిర్మాణాలను తొలగించి వారిపై చర్యలు తీసుకోవాలని చల్‌గల్ గ్రామస్తులు కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. గ్రామానికి చెందిన దయాకర్, గంగారెడ్డి ఇద్దరు వ్యక్తులు గ్రామంలోని గుడిముందుగల స్థలంలో రేకులషెడ్లు, బోరుబావి వేశారని తెలిపారు. అక్రమ నిర్మాణాలను తొలగించాలని కోరారు.

ఇల్లు కాల్చేస్తానని బెదిరించిన వ్యక్తిపై కేసు

సారంగాపూర్: ఇంటిని నిర్మించిన డబ్బులు చెల్లించలేదని ఇల్లు కాలబెడతానని బెదిరించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. స్టేషన్ హౌజ్ అధికారి అహ్మద్ కథనం ప్రకారం రేచపల్లి గ్రామానికి చెందిన తాటి నీరజ, ఆమె భర్త మల్లేశ్ కొత్తగా ఇళ్లు నిర్మిస్తున్నారు. ఇంటి నిర్మాణ పనులు వేములవాడ మండలం మర్రిపల్లి గ్రామానికి చెందిన మేస్త్రీ గాలి ప్రవీణ్ పర్యవేక్షించాడు. ఇంటి నిర్మాణం పూర్తయినప్పటికీ తనకు తనకు పూర్తిగా డబ్బులు చెల్లించడం లేదని ఇటీవల ప్రవీణ్ యజమానులతో గొడవపడి నీరజ, ఆమె భర్త మల్లేశ్‌తో పాటు మరో ఇద్దరిపై పోలీస్‌స్టేషన్‌లో తనను కులం పేరుతో దూషించారని ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు అట్రాసిటి కేసు నమోదు చేశారు. తన డబ్బులు ఇవ్వాలని గత నెల ఏప్రిల్ 30న నీరజ ఇంటికి ప్రవీణ్ పెట్రోల్ క్యాన్‌తో వచ్చి ఇంటికి నిప్పంటిస్తానని బెదిరించాడు.స్థానికులు అడ్డుకోగా పారిపోయాడు. దీనిపై నీరజ ఫిర్యాదు మేరకు ప్రవీణ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

టీషర్ట్‌ల పట్టివేత

జగిత్యాలక్రైం:జిల్లా కేంద్రంలోని కొత్తబస్టాండ్ ప్రాంతంలో సోమవారం సాయంత్రం పట్టణ ఎస్సై మన్మథరావు ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టగా కట్కం వంశీ అనే వ్యక్తి ఏలాంటి బిల్లు లేకుండా తీసుకెళ్తున్న 130 టీషర్ట్‌లు సీజ్ చేశారు.

మద్యం పట్టివేత

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని అన్నపూర్ణ చౌరస్తా వద్ద అక్రమంగా తరలిస్తున్న 4.5 లీటర్ల మద్యాన్ని పట్టుకుని సీజ్ చేసినట్లు పట్టణ ఎస్సై మన్మథరావు తెలిపారు. అన్నపూర్ణ చౌరస్తాకు చెందిన పూరెల్ల గంగాధర్ తన ద్విచక్ర వాహనంపై తీసుకెళ్తున్న మద్యాన్ని సీజ్ చేశారు.

షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె దగ్ధం

కొండగట్టు: కొడిమ్యాల మండల కేంద్రంలో సోమవారం శేఖర్‌కు చెందిన పూరి గుడిసె షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది.ఈ సందర్భంగా రూ.50 వేల నష్టం జరిగినట్లు భాదితుడు తెలిపారు. బాధిత కుటుంబాన్ని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపెల్లి సత్యం,స్థానిక నాయకులు పరామర్శించి రూ. 5వేలు ఆర్థికసాయం ,నిత్యావసర సరుకులు అందజేశారు. ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు.

ఇసుక లారీల పట్టివేత

ఇబ్రహీంపట్నం: మండల పరిధిలోని గండి హన్మాన్ చెక్‌పోస్ట్ వద్ద ఆదివారం అర్ధరాత్రి అక్రమంగా తరలిస్తున్న ఇసుక లారీను పట్టుకున్నట్లు ఎస్సై అనిల్ సోమవారం తెలిపారు. కథలాపూర్ నుంచి ఆర్మూర్ వైపు ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక రవాణాను చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కేసు నమోదు చేసి పట్టుకున్న ఇసుక లారీని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

మల్యాల: మండలంలోని రాంపూర్ శివారులో పేకాట స్థావరంపై సోమవారం సాయంత్రం పోలీసులు దాడి చేసి చేశారు. పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో అక్కడికి చేరుకున్న పోలీసులు పేకాట స్థావరంపై దాడి చేసి రూ.26,930 నగదు స్వాధీనం చేసుకున్నారు. పేకాట ఆడుతున్న ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అబ్దుల్ రహీం తెలిపారు.